# ఆ రోజుల్లో విన్న సంగతిమీద ఈ రోజుల్లో ఓ కల

కవికొండల వేంకటరావు

పై పేరుతో ఒక కథ నేడు వ్రాయగల్గుతూ వున్నానూ అంటే - మా వసతిగృహానికి వరదఅనంతరం కొత్తగా దరుజుచేసి వెల్లవేయబట్టి అనుకోండి; మరీన్ని శరత్కాలం కూడా వచ్చింది. చిరుచలి ప్రారంభించింది తెల్లవారగట్ల. ఇంకా అనుకూలమైన దేశకాలపాత్రలను వివరించవలసివస్తే, నూతనంగా ఆంధ్రరాష్ట్రం వచ్చింది. పగలు తెల్లటి మేఘాలు దూదికొండల్లా ఆకాశంమీద నిలబడివుంటూ వున్నాయి! అమావాస్యరాత్రిల్లో చుక్కలు మింట ప్రకాశమానంగానూ, ఆ చుక్కల్నే అన్నింటినీ కలోసి జుట్లు ముళ్లేట్టి, మూటకట్టి, అద్దపుబరణిలో క్రిక్కిరిసేలాగు నక్కింపజేసినట్టు పవర్ణమీదేవి, పూరా చంద్రబింబం పరిఢవిల్లేని. మరీన్ని దసరా వుత్సవాలు అవుతూ వున్నాయి. సరస్వతీ పూజలు, దుర్గారాధనలు, గిలకల పండగలు, వీరవినోదాలు ఇవన్నీ ఆరేలకు ముఖ్యాంగాలుగా వుండి వేడుక గొల్పుతూన్నాయి. నేనున్నూ ఒక తెల్లవారుజామున "రగ్గు" కాళ్లమీదకు తీసుకుని, లోపల గుండెకాయ "లబ్ డబ్" దెబ్బలిస్తూవుంటే, జోకొట్టులా, కళ్ళు మూసుకుంటూ కలకంటూ వున్నాను.

కల అంటే కలకాలముండేదానిలా తోచింది. మీరంతా "కల" అంటే అప్పటికప్పుడు కనబడి హారతికర్పూరపు హారతిలా అంతమొంది పోయేనని అనుకుంటారులాగుంది. అలాంటి కలకాదు నాది. నా కలలో మనుష్యులు తల్లక్రిందులుగా నడచేరు. అవ్యక్తంగా మాటాడేరు. నేనూ నా ప్రకృతిరూపంలో వారి నర్తంచేసుకుంటూ, ఈ శరీరంయొక్క వేధ మేధ అన్నీ దాటి వేటే గాధలో పడ్డానేమో అన్నట్లు, అన్యత్రాపాత్రగా ప్రవర్తిస్తూ వుంటాను. మరు దెవడైనా ఆ కల తీరుకన్నాడా, ప్రత్యక్షంగా మంచం మీద నిదరోతూ నేనూ, నేనే అవల నాటకంలో పాత్రలాగూ రెండూ ఒకే రకపు శరీరములుగా ఒకేరకపు గొంతుకలు దాల్చివున్నట్టు తోచి తీరుతుంది. అయితే నాకు నేనే కలకంటూ వున్నానేమో, అద్దంలో చూచుకొన్నట్టు నా రూపు నాకే కనిపించేని. అంత అలా కనబడ్డా "ఇక్కడకెల్లా వచ్చావు నీవు?" అనే ప్రశ్న పొడమలేదు. అంత మమైకంగా ఆ మాయలో పడిపోయి ఆ కర్మకొండను అనుసరిస్తూవున్నాను.

పర్ణశాలమీద పక్షిగా నిలిచి, పాపికొండలమీద పడవలాగయిపోయి, పట్టిసం ఆప్రాంతానికి వచ్చేసరికి కడవలాడి కల్లో, వెల్లప్పానకమో అన్నంత నురుగుతో పెరుగుతో వీరభద్రుణ్ణి ముంచెత్తి, మయ్యేరు కట్టతెగినట్టు అయి, అయ్యేరు విసురు చూపెడుతూ వుంది. "ఓయి! ఒయ్యోయి!" అంటే, "ఇంకేముంది? ఒయ్యోయి!" అని రయితులూ, ఏమల్లోయి! ఏంచేదాం?" అని పల్లెటూళ్ళ ఆడవాళ్ళు, ఆ జనపద ప్రాంతాన్నీ అలజడి పోసాగారు.

అది వుదయమే! బాగా వెలుగొచ్చింది! చెట్టూ పిట్టా ఎక్కడున్నది ఏమంటూ వున్నది తెలుస్తూనే వుంది. "అయితే అంధకారమన్నది అరుబయటది కాదు. అంతఃకరణది!" అన్నట్టు ప్రతీ మనిషియొక్క అంతరంగంలోను అదో తరంగము వడిచుట్టి సుడిగుండం తిప్పేస్తూవున్నట్టు అయిపోయింది.

ఆపొద్దు ఆమెకు నీళ్లాడుపొద్దు. నులకమంచంమీద, మోకాల్లోతునీళ్ళల్లో నీళ్లాడి పిల్లణ్ని కని వొళ్ళు మఱచి వుందన్నారు. మంచంక్రింద కుంపటీ పెట్టడానికి వరదనీరు, మంచంకోళ్ల ఉసిఉసి కదలిస్తూవుంది. లేడీడాక్టరు సాయంపొందడానికి అది గట్టుక్రింద ఏదో పల్లెటిపట్టు. జలం చుట్టు తిరిగి మెట్టెక్కి ఊళ్లో పడిందంట! ఊరంతా తప్పించుకు, కొందఱు తాడిచెట్ల కెగబ్రాకి, కొందఱు మఱ్ఱివూడ లట్టుకు వ్రేలాడి, కొందఱు ముందఱకు వెళ్ళి వెనక్కువచ్చి, "చచ్చామర్రో" అని కూతేసి, చావకుండా బ్రతక్కుండా బావురుపిల్లుల్లా, గుంటనక్కల్లా, ఈతబడి ఏర్పాటుగా కాపడేరు.

ఒక్క ఈమే ఎవరికీ అగపించడంలేదు. అప్పుడు పుట్టినపిల్ల కొత్తనీట తెప్పన తేలిపోతూవుంటే, తల్లి పురటాలు మునివ్రేళ్లమీద నిలబడి బుజాన్ని మోస్తుందా? మోకరించి వేయిదేవుళ్ళకూ మ్రొక్కుతుందా?

ఆమెముందు 'ఏడుకొండలోడు' ఎత్తుగా సాక్షాత్కరించాడేమో, పురిట్లో పిల్ల నలా త్రోసేసింది. ఆ త్రోసివేత తెగింది తల్లీ పిల్లా యొక్క కలగలపు బొడ్డుప్రేగు. పిల్ల విడివడింది. తల్లి పడిపోయింది. పిల్ల తేల్తూ, అరఫర్లాంగు దూరంలో తేరుకుంది. తల్లి తెప్పరిల్లింది. పిల్ల ఫర్లాంగుదూరంలో వరదనే ఎవరిచేతనో పైకెత్తబడి లాలింపబడింది. తల్లి అదోపాలనగా పరకాయిస్తూ బ్రహ్మానందభరితురాలై తనదారి తాను వెతుక్కోసాగింది. నులకమంచం నులకమంచం రేగిపోయి గుడిసెకో పిలకలా మెలిసిపోయింది.

పురటాలు ఒక బొప్పాసిచెట్టు నాధారం చేసుకు, ఆ గొట్టాలంట చిమ్మటి గొట్టినట్టు నీరు కొడుతూవుంటే, అటు తిరిగి ఇటుతిరిగి అన్ని కొమ్మలా తన బాహువు లొంచి, రాహుకేతువులిద్దఱూ ఒక్కుమ్మడి పట్టి పాలార్చినట్టు ముఖం చూపెట్టసాగింది.

ఏలాగో, నానుడీలా, నాడిలా వ్యాపించిపోయింది నక మొకాల! "బొప్పాసిచెటు మీద ఆమె పురుడోసుకొంది" అంటే "పురుడోసుకొంది!" అని వెంటనే దేవలోకంలో విడ్డూరం! "మరి పాలకు కొదవతే"దని మానవలోకంలో ప్రచారం. "ఇంతకూ పుట్టినపిల్ల ఏమైంది?"అని అడిగిన పాపాన్ని ఒక్కడూ పోలేదు ఆ జనపద ప్రాంతాన్ని. అంతా వేళాకోళమాడినవారే "ఈ జలఝంఝూటనకు తోడు ఝంఝామారుతం వీస్తే ఆ బొప్పాసిచెటు పసతేలిసేని!" అని. ఆమెమాత్రం, ఆపురటాలుమాత్రం, "దేవుని ఘుట్టి మనలో వున్నంత సేపు, ఏచోటయినా ఘుట్టే, ఏ పుట్టయినా

(48-వ పేజీ చూడండి)

# ఆ రోజుల్లో విన్న సంగతిమీద ఈ రోజుల్లో ఓ కల

(5-వ పేజీ తరువాయి)

ఘట్టే!" అని జవాబుచెప్తూ పాటిమీద తన శిశువుకోసం సెమకులాడేనట!

అయితే శిశువు ఎవరిచేతనో రక్షింపబడింది అని యావఱలోనే విన్నాం!— కాని తల్లియొడిలోకి చివరకొచ్చిందా? వస్తే ఏలా వచ్చింది? అనే రెండు ప్రశ్నలకు సమాధానం ఈ కథగుండా రాదా? అదీ నా దుగ్ధ! ఇదీ వినికిడిమీదనే సాధించాలి! పాఠకులారా ఆలకించండి!

శిశువు నోచేత్తో రక్షిస్తూ, రెండవ చేతను అతడే ఒక పామును శిక్షించాడు. వరదలో ఎటుచూచినా పాములే! పాములంటే జ్ఞాపకం వచ్చేని, పట్నవాసపు రేవులో ఒక రావిచెట్టు, పేద్దచెట్టు, పై కొమ్మలు మాత్రంగా మిగిలివుంది. మిగిలివున్న కొమ్మలు లెక్కిస్తేనే ఒక వంద ఏభై యున్నాయి. మునిగిన కొమ్మలుకూడా కలిపితే ఎన్ని వుండేనో! పై కొమ్మల్లోకంటూ ఒక పాము ఎక్కింది, తన ప్రాణం తాను దక్కించుకుందామని. ప్రజలు ఆలా దాన్ని ప్రాణంతో పోనిస్తారా? పదిమంది పది కొమ్మలకూ ఎక్కి, "పాము పాము" అని, అది ఆ కొమ్మకూ ఈ కొమ్మకూ పాకులాడుతూ వుంటే, కర్రతో నీళ్ళమీద పడేటట్టు చేసి, నీళ్ళమీద వోదెబ్బ, దాని పడగమీద వోదెబ్బ అన్నట్టు దబదబా మొత్తేశారు. ఏముంది? పాము చచ్చింది! పట్నవాసంలో రేవు కాబట్టి సులువుగా చావగొట్టారు. అదే పల్లెటిప్రాంతం అయితే, పది పాములు కలిసి బరితెగినట్టు, చెరలాడి, ఒక్కపాము వేయి మెలికలు తిరిగి, మీది ప్రాణం క్రిందకు వచ్చేటట్టు చేస్తుంది ఏ మానవుణ్ణయినాసరే! అయితే నేనన్న ప్రత్యేక వ్యక్తి వున్నాడా, అతగాడు, సునాయాసంగా, అతిసునాయాసంగా, ఒక చేత్తో నాగుబామును చంపుతూ రెండో చేత్తో వామును రక్షించాడు గరుడుడా అన్నట్టు!

రక్షింపబడ్డ శిశువు కేరున అఱచి, కవ్వన గొంతి ఒక పెట్టెలో పడ్డాడు. పెట్టెలో పడ్డాడూ అంటే దాని మూత తెఱచి వుండాలి! పెట్టె తేల్తూవుండాలి! సర్వసాధారణంగా పెట్టె నెవడైనా చేతపట్టుకు ప్రవాహంలో తేలి వస్తూవుంటే, "లాభం లేందే సెట్టి ఏటబడడు" అంటారు. కాని ఇక్కడ ఉత్తపెట్టే, మూతతెఱచుకు, తేలిపోతూవుంటే, శిశువు కాబట్టి లాభం చూడకుండా ప్రాభవమే చూసుకు అందులోకి పడ్డాడు. ఈ శిశువు పడ్డాడో లేదో పెట్టె మూత పడిపోయింది. శిశువుమాట పెట్టె మూతపడ్డం మాట మఱచి కొత్తమనిషి, పెట్టెలో బంగారు వస్తువు లుండివుండాల అనే అంచనాను మునిగీత ఈదేడు. పైకో గొలుసు ఒక కట్టెడ కాసులపేరు గజ్జల వొడ్డాణం గమ్మన ఎత్తేడు. అవి పైకెత్తి వాటిని మెఱయించేలో ఈ పెట్టే శిశువూ అల్లంత దూరంపోయి అదృశ్యమయినాయి!

"ట్రాక్" "రీల్" "కట్" అయిపోయినట్టు, కొంతసేపు అగమ్యగోచరంగాను, అంధకార బంధురంగాను వుండిపోయింది నాకల! నాకల నాకే నల్లగా కనబడసాగింది. మళ్ళీ కల అతుక్కోవడంలో ఒక "లేడీ డాక్టరు" కనబడింది. ఆమెకూడా జలజంతువులా నడుస్తూ వుంది నీటిలో. ఆ నీరే అనుకోవాలి ఈ నీరూను. ఎంచేతా అంటే లేడీ డాక్టరు ఎగ్గట్టు దిగుచాయను పైపెట్టె తాకినట్టయింది. అట్టే చేతిలోని సైతెస్కోపు బుజమ్మీదకు విసురుకోని,—ఆ పెట్టె నాపి మూత తీసి చూసింది. మరో నిమిషములా వుండివుంటె ఆరోజు రోజున్నర బిడ్డ ఉక్కిరి బిక్కిరై చచ్చేది! అని ముద్దులాడి, సుద్దులాడి బుజాన్నేసుకుంది బిడ్డణ్ణి! బిడ్డడి గుండెకాయ యొక్క దెబ్బల్ని సైతస్కోపు దానంతటదే లెక్కిస్తూ వుంది. బిడ్డకు మరి ఫరవాలేదని జగత్తు వూహించినట్టుగా జయశంఖారావం చేసింది.

విన్న సంగతైనా నమ్మదగినదిగా వుండాలి! వెంటనే అడిగాను ఒక ప్రశ్న! "నీ వక్కడెలా గున్నావమ్మా!" అని లేడీ డాక్టర్ని. ఆమె నన్ను చూస్తూ స్మిత వెంటనే అభినయించింది. "లేదు సార్! నా వృత్తి సార్! అది! పురుళ్ళు పోయడం నా వృత్తి సార్" అంది. "వరదకు పురుడు పోయడం ఏమిటమ్మా?" అని పక్కున నవ్వాను. "మగవాడవు నీకేం తెలుస్తుంది ఆడవాళ్లు పడేపాట్లు?" అని ఆ లేడీడాక్టరు చిరునవ్వు నవ్వింది. "అయితే పిల్లనేం చేస్తారు? అని అడిగాను. "తల్లి తెలియనప్పుడు తండ్రి తెలియనప్పుడు "అర్ఫనేజి"కి చేరుస్తాం" అంది లేడీ డాకరు. "అది గొప్ప సంఘసేవే" అన్నాను నేను.

ఇలా మేమిద్దఱం వరదలో మోకాళ్లోతు నొకరం మెళ్లోతు నొకరం, ఎవరివి "హైహీల్డ్ షూస్సో" తెలియకుండా నిలబడి మాట్లాడుకుంటూ వున్నాం, పైన ఒక వాయు విమానం గిర్రున తిరిగినట్టయింది. ఆ వరదరోజుల్లో మహా తిరిగాయి లెండి ఆలాంటి యంత్రాలు. "ఆ వాయువిమానం నేలకు దిగి ఈ బిడ్డణ్ణి తీసికొని 'అర్ఫనేజి'కి చేర్చకూడదూ?" అంది లేడీ డాక్టరు. "వాయువిమానంమీద వాళ్లు భూతద్దాల్తో చూడ్డానికి పుట్టారు. కాని బరువు మోయడానికి పుట్టలేదు" అన్నాను. "ఇలా లెండి బిడ్డణ్ణి" అంది తల్లి ఎక్కణ్ణుంచో! నా కళ్లల్లో ఒక మెఱపు మెఱసింది.

"నీవు ఈ పిల్లణ్ణి ఈ వరద నీట కన్నావు అంటే నాకు నమ్మ శక్యంగాకుండావుంది" అంది లేడీ డాక్టరు! "బొప్పాసి చెట్టు సాక్షిగా!" అంది ఆ పురటాలు. "ఇన్ని చెట్లుండగా బొప్పాసి చెట్టునే సాక్ష్యం వేసుకుంటావేం?" అని అడిగింది లేడీ డాకరు. "అటువంటి భూజం మఱి వొకటి కానబోను!" అంది ఆ యిల్లాలు. "లేడీ డాక్టరు భుజంకూడా ఆలాంటిదే" అన్నాను నేను. "నా భుజం! నా భుజం! అదో ఎటర్నల్ అర్ఫనేజి! తల్లీతండ్రులు లేని బిడ్డలకు శాశ్వత పుట్టిల్లు!" అంది. "అది ఎట్లా" అన్నాను ఎటకారంగా ఆమెకేసి చూస్తూ! ఆమె అతివాస్తవికంగా తనకళ్లల్లోకి కాంతి నింపుకొని, "ఏ బిడ్డకు తల్లివున్నా ఏ బిడ్డకు తండ్రివున్నా, ఈబిడ్డకు మాత్రం ఎన్నడూ తండ్రిలేడు! దేవునికొడుకు ఈతడు. ఈతను జీసస్!" అని ఒక చిహ్నాన్ని తన బుజం మీద చూపించిందై "ఇతణ్ణెప్పుడూ ఈ బుజంమీద నేను మోసేను - వరదప్పుడు వానప్పుడు, వయసప్పుడు, వార్ధక్యమప్పుడు!" అంది.

"దేవుని యెడల నమ్మకం అంటే ఆలా వుండాలి!" అన్నాను వెంటనే ఏదో భావ నాగరిమను ఆ లేడీ డాక్టరు కళ్లల్లోని నును కాంతి నొక్కింత మూఱగొంటూ.

కాని లోకం 'కన్నాను' అని అనదుగా! "విన్నాను" అనే అంటుంది.—"దేవుడూ లేడు దెయ్యమూ లేదు. బొప్పాసి చెట్టు అప్పా! నే విన్నాను అప్పా! నీళ్లాడింది బొప్పాసిచెట్టు అప్పా!" అని లోకం అన్నట్టయింది, వరదలో కొట్టుకుపోతూ.

మేము చూస్తుంగండా! మాపాదాలక్రింద మఱి ప్రవాహంలేదు. మాంచి! మిలమిలా! మెఱసిపోయే గంద్రిసుక జరజరామంది. నే పరున్న చోటు చోటూ జరిగినట్టయింది!

మెలకువగొన్నాను! కలను కలకాలం నిలపాలని ఈ కథ ఇలా వ్రాశాను. ★

శ్రీమదాంధ్ర
మహాభారతము
ఉద్యోగపర్వము
వెల రూ 1-0-0
ఆంధ్రగ్రంథమాల-మద్రాసు-1.